# చమురు ధరల స్థితి-నియంత్రణ సడలింపు (డీరెగ్యులేషన్) విధానం

**క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల వల్ల ఏర్పడే రెవెన్యూ నష్టాలను తగ్గించుకోవడానికి మే 14, 2011న ప్రభుత్వరంగ చమురు సంస్థలు పెట్రోలు ధరలను సుమారు తొమ్మిది శాతం పెంచాయి. పెరిగిన పెట్రోలు ధరల వల్ల ద్రవ్యోల్బణ పరిస్థితులు కన్పించే అవకాశాలు ఎక్కువ.**




**జూన్** 2010న భారత ప్రభుత్వం ఆర్థిక సంస్కరణగా పెట్రోలు ధరలపై నియంత్రణను తొలగించింది. తద్వారా చమురు సంస్థలకు ప్రభుత్వం గతంలో కల్పించిన సబ్సిడీల నుంచి పాక్షికంగా వైదొలగింది. ధరలపై నియంత్రణ విధానం తొలగించిన తర్వాత మే 14, 2011 వరకు ఎనిమిదిసార్లు ధరలు పెరిగాయి. ధరలు పెంచిన తర్వాత కూడా ప్రతి లీటరుకు ఐదున్నర రూపాయలు చమురు సంస్థలు నష్టపోతాయని, అందువల్ల చమురు ధరలు ఇంకా పెరుగుతాయని ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ) అభిప్రాయపడింది. అంతేకాకుండా లిబియా, ఈజిప్ట్, సిరియా, ట్యునీషియా, బహ్రెయిన్ దేశాల్లో నెలకొన్న రాజకీయ సంక్షోభ ప్రభావం చమురు ధరలను ప్రభావితం చేస్తుంది.

ప్రపంచ చమురు ఉత్పత్తిలో 2004 సంవత్సరం అర్థభాగం నుంచి పెరుగుదల సంభవించింది. చైనా, భారత్‌లో చమురు వినియోగం పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు డిమాండ్ పెరిగింది. ప్రపంచంలో చమురు నిల్వలు సౌదీ అరేబియాలో ఎక్కువ. ఐరోపా దేశాల్లో అజర్ బైజాన్, కజికిస్థాన్, రుమేనియా, పాత సోవియట్ బ్లాక్‌లోని దేశాల్లో చమురు నిల్వలు ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న చమురు డిమాండ్‌కు ఈపరిశ్రమలో పెట్టుబడులు పాక్షికంగానే ఉపకరించాయి. కొత్తగా పెరుగుతున్న డిమాండ్‌కు ఈ పరిశ్రమలో 16 శాతం పెట్టుబడి మాత్రమే అందుబాటులోకి వచ్చింది. రిజర్వ్‌ల నుంచి తగ్గుతున్న ఉత్పత్తిని పూరించడానికి (కాంపెన్సేట్) మిగులు 84 శాతం పెట్టుబడులు అవసరం.

## ఆర్థిక వృద్ధి:

చమురు ఎక్కువగా వినియోగించుకునే దేశాల్లో ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి జరుగుతున్న కృషిలో భాగంగా చమురుకు డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2003 తర్వాత పురోగమించినందువల్ల అనేక ప్రాంతాల్లో స్థూల దేశీయోత్పత్తిలో గణనీయమైన పెరుగుదల సంభవించింది. అమెరికా, చైనా లాంటి చమురు దిగుమతి చేసుకునే దేశాలతో పాటు జపాన్, రష్యా, ఆసియా ఖండంలోని అత్యధిక వృద్ధి సాధిస్తున్న దేశాలు ఇటీవల కాలంలో మరింత వృద్ధి సాధించాయి. అమెరికా ఆర్థికవృద్ధికి, అధిక స్థాయిలో ఉన్న చమురు వినియోగానికి, చమురు డిమాండ్ పెరుగుదలకు అవినాభావ సంబంధం ఉంది. చైనాలో ఎగుమతుల వృద్ధి.. పారిశ్రామిక అవసరాలకు చమురు డిమాండ్‌ను పెంచుతూ.. తద్వారా పెరుగుతున్న వినియోగదారుల ఆదాయం చమురు డిమాండ్‌కు కారణమైంది. అమెరికాలో చమురు డిమాండ్ రోజుకు 20 మిలియన్ బ్యారెల్స్ . కాగా చైనాలో ఆరు మిలియన్ బ్యారెల్స్. ఈ రెండు దేశాలలోనూ జీడీపీ వృద్ధిలో వచ్చిన పెరుగుదల, ఆర్థిక కార్యకలాపాలు విస్తృతమైనందువల్ల శక్తి డిమాండ్ పెరుగుదలకు దారితీసింది. చమురు డిమాండ్‌లో వచ్చిన పెరుగుదల.. ధరల పెరుగుదలకు దారితీసి జీడీపీ వృద్ధిరేటులో తగ్గుదలకు దారితీయొచ్చు.

1) చమురు ధరల పెరుగుదల దేశంలో ద్రవ్యోల్బణానికి దారితీసినప్పుడు.. కేంద్ర బ్యాంకు ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే చర్యలో భాగంగా..'నియంత్రణ ద్రవ్య విధానం' అవలంబించినప్పుడు ఆ ప్రభావం జీడీపీ వృద్ధిరేటును క్షీణింపజేస్తుంది.

2) మరోవైపు చమురు ధరలు పెరిగినప్పటికీ వినియోగదారులు చమురు వినియోగాన్ని తగ్గించుకోనట్లయితే వారు ఇతర వస్తు సేవలపై చేసే వ్యయం తగ్గి జీడీపీ వృద్ధిరేటు తగ్గుతుంది.

## వినిమయ రేటు:

అమెరికా డాలర్ వినిమయరేటులో వచ్చే మార్పులు ప్రపంచవ్యాప్తంగా చమురు డిమాండ్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఇతర దేశాల కరెన్సీలతో పోల్చినప్పుడు అమెరికా డాలర్‌లో వచ్చే హెచ్చుతగ్గులు అన్ని కరెన్సీలకు ఒకే విధంగా ఉండవు. జపాన్, ఇతర ఆసియా దేశాలు కరెన్సీ మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం ద్వారా తమ కరెన్సీతో పోల్చినప్పుడు అమెరికా డాలర్ విలువలో ఎటువంటి తగ్గుదల లేకుండా చేయడానికి ప్రయత్నిస్తాయి. అమెరికా డాలర్‌లో చైనా స్థిర వినిమయ రేటు నిర్వహించడం ద్వారా డాలర్‌తో పోల్చి యువాన్ (చైనా కరెన్సీ) విలువలో ఏవిధమైన పెరుగుదల లేకుండా చూడటానికి ప్రయత్నిస్తుంది. చమురు దిగుమతి చేసుకునే దేశాలపై క్షీణిస్తున్న డాలర్ ప్రభావం ఏవిధంగా ఉంటుందనేది డాలర్ విలువలో వచ్చే మార్పుకు అనుగుణంగా తమ కరెన్సీలను ఏ విధంగా సర్దుబాటు చేయగలిగాయనే దానిపై ఆధారపడి ఉంటుంది.

SAKSHI

## క్రూడ్ చమురు ధరలు:

అధిక సప్లై లేదా కొరత ఏర్పడినప్పుడు ఇతర వస్తువుల ధరల్లో వచ్చే మార్పుల కంటే క్రూడ్ చమురు ధరల్లో ఏర్పడే ఒడిదుడుకులు ఎక్కువ. ఒపెక్ (చమురు ఎగుమతి దేశాల సమాఖ్య), నాన్ ఒపెక్ దేశాల సప్లైలో వచ్చే మార్పులతో పాటు డిమాండ్‌లో వచ్చే మార్పులు.. వీటి ధరల్లో ఒడిదుడుకులకు కారణమవుతున్నాయి. 1948 నుంచి 1978 వరకు చమురు ధరలు బ్యారెల్ మూడు డాలర్లుగా స్థిరంగా ఉంది. ఇరాక్, ఇరాన్, సౌదీ అరేబియా, కువైట్, వెనెజులా దేశాలతో కలిపి 1960లో ఒపెక్ ఏర్పడిన తర్వాత ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం సాధించడానికి ఒపెక్‌కు దశాబ్దం పట్టింది. 1971 చివర్లో ఖతార్, ఇండోనేషియా, లిబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అల్జీరియా, నైజీరియా దేశాలు ఒపెక్‌లో సభ్యత్వం పొందాయి. 1972లో బ్యారెల్ చమురు కొనుగోలు శక్తిలో తగ్గుదల సంభవించింది. యుద్ధ కాలం తర్వాత ఎగుమతి దేశాల క్రూడ్ చమురు డిమాండ్‌లో పెరుగుదల సంభవించినప్పటికి బ్యారెల్ చమురు కొనుగోలు శక్తిలో 40 శాతం తగ్గుదలను సభ్యదేశాలు గమనించాయి. 1972లో బ్యారెల్ చమురు ధర మూడు డాలర్లు. కాగా 1974 చివరనాటికి ధర 12 డాలర్లకు పెరిగింది. అక్టోబర్ 5, 1973న సిరియా, ఈజిప్ట్‌లు ఇజ్రాయెల్‌పై దాడి చేసినప్పుడు అమెరికాతో పాటు అనేక పశ్చిమ దేశాలు ఇజ్రాయెల్‌ను బలపరిచాయి. ఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్న దేశాలపై అరబ్ దేశాలు వ్యాపార నిషేధాజ్ఞలు విధించాయి. ఈ క్రమంలో రోజుకు ఐదు మిలియన్ బ్యారెల్స్ ఆయిల్ ఉత్పత్తిని ఈ దేశాలు తగ్గించుకున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు ఉన్న చమురు ధరలపై నియంత్రణ అమెరికా నుంచి ఒపెక్ దేశాలకు బదిలీ అయింది.

1979, 1980ల్లో ఇరాన్, ఇరాక్‌ల మధ్య జరిగిన సంఘటనలు క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలకు దారితీశాయి. 1978 నవంబర్ నుంచి జూన్ 1979 మధ్యకాలంలో చమురు ఉత్పత్తిలో రోజుకు రెండు నుంచి 2.5 మిలియన్ బ్యారెల్‌ల లోటు సంభవించడానికి 'ఇరాన్ విప్లవం' కారణమైంది. ఇరాన్, ఇరాక్ దేశాల చమురు ఉత్పత్తి ఉమ్మడిగా రోజుకు 1979లో 6.5 మిలియన్ బ్యారెల్స్. కాగా 1980లో 1 మిలియన్ బ్యారెల్స్ మాత్రమే. ఈ క్రమంలో ప్రపంచ చమురు ఉత్పత్తిలో దాదాపు పది శాతం తగ్గుదల సంభవించి బ్యారెల్ చమురు ధర 35 డాలర్లకు చేరుకుంది. 1970వ దశకంలో సంభవించిన శక్తి సంక్షోభం కారణంగా పారిశ్రామిక దేశాల్లో ఆర్థిక కార్యకలాపాలు తగ్గాయి. దీని కారణంగా చమురు అధిక ఉత్పత్తితో పాటు వినియోగంలో తగ్గుదల సంభవించి క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గాయి. అమెరికా చమురు దిగుమతిలో 1977లో 46.5 శాతం తగ్గుదల ఏర్పడగా 1982-83లో ఈ తగ్గుదల 28 శాతం. 1980లో 35 డాలర్లు ఉన్న బ్యారెల్ చమురు ధర తర్వాత ఆరేళ్లలో తిరిగి పది డాలర్లుకు తగ్గింది. అధిక చమురు ధరలు ఉన్న కాలంలో ఒపెక్ దేశాలకు బయటి దేశాలలో చమురు అన్వేషణ, ఉత్పత్తిలో పెరుగుదల సంభవించింది. 1980, 1986 మధ్య నాన్ ఒపెక్ దేశాల్లో రోజుకు చమురు ఉత్పత్తి పది మిలియన్ బ్యారెల్‌కు చేరుకుంది.

1982 నుంచి 85 మధ్య ధరల స్థిరీకరణ సాధించే ఉద్దేశంతో ఒపెక్ తన సభ్యదేశాలకు ' ఉత్పత్తి కోటా'లను నిర్ణయించింది. తమ కోటా పరిధిని దాటి సభ్యదేశాలు చమురు ఉత్పత్తి చేసినందువల్ల ఆశించిన లక్ష్యం నెరవేరలేదు. కువైట్‌ను ఇరాక్ ఆక్రమించడం వల్ల 1990లో జరిగిన గల్ఫ్ యుద్ధం చమురు ధరల తీవ్ర పెరుగుదలకు కారణమైంది. 1990 నుంచి 1997 మధ్య ప్రపంచ చమురు వినియోగం రోజుకు 6.2 మిలియన్ బ్యారెల్స్‌కు పెరిగింది. ఆసియా దేశాల వినియోగం రోజుకు 3,00,000 బ్యారెల్స్‌గా ఉండి 1997లో తిరిగి ధరల రికవరీకి కారణమైంది. రష్యాలో చమురు ఉత్పత్తిలో తగ్గుదల కూడా ధరల రికవరీకి కారణం.1990-96 మధ్య రష్యాలో చమురు ఉత్పత్తి రోజుకు ఐదు మిలియన్ బ్యారెల్స్‌కు తగ్గింది. 2003లో చమురు ధర బ్యారెల్‌కు 30 డాలర్లు. కాగా 2005 ఆగస్టు నాటికి 60 డాలర్లకు పెరిగింది.

ఆర్థిక తిరోగమనం కారణంగా జూలై 2008న బ్యారెల్ ధర 147.30 డాలర్లకు పెరిగింది. 2009లో ప్రపంచ చమురు డిమాండ్ వృద్ధి రుణాత్మకంగా (1.3 శాతం) ఉండగా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గత రెండేళ్లుగా పురోగమిస్తుండటంతో 2010లో చమురు డిమాండ్ వృద్ధి 3.4 శాతానికి పెరిగింది. 2011లో ఈవృద్ధి 1.6 శాతంగా ఉండగలదని 'ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ-ఆయిల్ మార్కెట్ నివేదిక' అభిప్రాయపడింది. ప్రపంచ చమురు డిమాండ్ వృద్ధిలో వచ్చిన మార్పులు అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరల్లో ఒడిదుడుకులు రావడానికి కారణమయ్యాయి.

## భారత్:

గత పదేళ్లల్లో భారత్ చమురు వినియోగం సగటు వార్షిక వృద్ధి 4.6 శాతం. కాగా చైనా మినహా ఇతర ఎమర్జింగ్ మార్కెట్స్‌లో ఈ వృద్ధి 1.3 శాతం. చైనాలో చమురు వినియోగం సగటు వార్షిక వృద్ధి 7.5 శాతం. భారత్‌లో పెరుగుతున్న చమురు డిమాండ్‌ను దిగుమతుల ద్వారా తీర్చుకుంటున్నందువల్ల వాణిజ్య శేషం, చెల్లింపుల శేషంలో లోటు పెరుగుతుంది. జూలై 2008లో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర బ్యారెల్‌కు 147.30 డాలర్లకు చేరుకున్నప్పుడు చెల్లింపుల శేషంలో లోటు తీవ్రమైంది. స్వదేశీ వినియోగదారుల అవసరాల నేపథ్యంలో ప్రభుత్వానికి ఒకవైపు ద్రవ్యలోటు పెరగ్గా మరోవైపు చమురు సంస్థలకు ఆర్థిక సమస్య పెరిగింది. మొత్తం పెట్రోలియం ఉత్పత్తుల్లో 63 శాతంగా ఉన్న పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఎల్‌పీజీలకు సంబంధించి అభిలషణీయ ధరల విధానాన్ని అవలంబించాలనే ఉద్దేశంతో ఆగస్టు 31, 2009న పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వశాఖ ఒక నిపుణుల గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వరంగ చమురు సంస్థల అండర్ రికవరీస్ ₹ 53,000 కోట్లకు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నష్టాలను పాక్షికంగా భరించడానికి విత్త మద్దతు ప్రకటించడం గానీ లేదా ఏటా ఆయిల్ బాండ్లను ఇష్యూ చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ప్రభుత్వం తన వైపు నుంచి ఆర్థిక భారం తగ్గించుకోవడానికి నియంత్రణ సడలింపు విధానాన్ని అవలంబిస్తుంది.

మార్కెట్ శక్తుల ఆధారంగా ధరల నిర్ణయం జరుగుతున్నందువల్ల మొదట్లో ధరల పెరుగుదల సంభవించినప్పటికీ తర్వాత కాలంలో ధరల స్థిరీకరణ సాధ్యమైంది. చమురు ధరల స్థిరీకరణ వల్ల చిన్న ఉత్పత్తిదారుల్లో పోటీతత్వం మెరుగవడానికి అవకాశం ఏర్పడింది. నియంత్రణ సడలింపు ప్రభావం ఆర్థిక వ్యవస్థలో సేవల నాణ్యత, పెట్టుబడులు పెరగడానికి దోహదపడుతుంది. ప్రస్తుతం పెరిగిన చమురు ధరల ప్రభావం భారత్‌లో కొన్ని వస్తువుల ధరల పెరుగుదలకు దారితీసి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. పెరిగిన చమురు ధరలు ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించడమే కాకుండా విత్త మార్కెట్‌లపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయి. చమురు ధరల నియంత్రణ సడలింపు (డీరెగ్యులేషన్) విధానం వల్ల ద్రవ్యోల్బణంపై ప్రభావం 120–130 బేసిస్ పాయింట్లుగా ఉంటుందని అంచనా. మరోవైపు రూపాయి కరెన్సీ వినిమయరేటులో ఒడిదుడుకులు ఏర్పడతాయి.

నియంత్రణ సడలింపు (డీరెగ్యులేషన్) ప్రభావం భారత్‌లో ఆటోమొబైల్ పరిశ్రమ అభివృద్ధిపై స్పష్టంగా కనిపిస్తుంది. చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగానికి సంబంధించి వినియోగదారులు, ఉత్పత్తిదారులు అధిక ఇంధన సామర్థ్య వాహనాలపై దృష్టి కేంద్రీకరించాలి. నియంత్రణ సడలింపు వల్ల మార్కెట్‌లో ప్రైవేట్ సంస్థలు పెరగడానికి దోహదపడుతుంది. రిలయన్స్, ఎస్సార్‌లాంటి ప్రైవేటు రిఫైనరీలకు మార్కెట్‌లో మంచి అవకాశం లభించి ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు మంచి పోటీ ఇవ్వగలుగుతాయి.

SAKSHI